యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మున్సిపల్ కమిషనర్ విజయసారధి
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



రేపల్లెలో యోగాసనాలు వేస్తున్న ప్రజలు



ఐలవరంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రేపల్లె రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ విజయసారధి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వెంకటేశ్వర యోగా శిబిరం కార్యాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచవచ్చన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. యోగా గురువు జి.సురేష్ పురప్రజలచే యోగాసనాలు చేయించారు. శిబిరం అధ్యక్షుడు తూనుగుంట్ల పాండురంగారావు, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వాసవీ క్లబ్ వనిత ప్రెసిడెంట్ నంబూరు లక్ష్మీసరిత, వాసవీ క్లబ్ సభ్యులు నంబూరు సత్యప్రసాద్, అన్నం శ్రీనివాసరావు, సాయిరాం, రత్నాకర్, లలిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని మాంట్‌ఫోర్ట్ స్కూలులోనూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో...



ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో యోగాడేలో పాల్గొన్న అతిథులు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల జాయింట్ సెక్రెటరీ మంతెన కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రపంచంలో భారత దేశం అందించిన అద్భుతాలలో యోగా ఒకటన్నారు. మనిషి మానసిక ప్రశాంతత, ఆరోగ్యానికి యోగ ఎంతో దోహదం చేస్తుందన్నారు. నగరం డిగ్రీకళాశాల, రేపల్లె కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం ర్యాలీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, ఎన్‌సీసీ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి ఉన్నారు.

కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో ..

కొల్లూరు: అంతర్జాతీయ యోగ దినోత్సవం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. బుధవారం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినిలు పలురకాల యోగాసనాలు ప్రదర్శించారు. హెచ్‌ఎం చావా ఉషాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు, చదువుపై ఏకాగ్రత నిలిపే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ కె.విజయ పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాచర్ల మోహన్‌రావు మాట్లాడుతూ ధ్యానం, యోగా వల్ల మంచి ఆరోగ్యం, మనసుకు ఆనందం కలుగుతుందని అన్నారు. బాపట్ల జిల్లా సహ పరియోజన్ సహ కన్వీనర్ పడమట వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఎఫ్ బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మాతా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ డి.మాతయ్య, ప్రిన్సిపాల్ కొత్త రవి తేజ, ఎస్ఎస్ఎఫ నిర్వాహకులు బూర్లె అరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు. వివేకానంద విగ్రహ సాధన కమిటీ, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బూర్లె సుబ్బారావు, నిర్వాహకులు మద్దుల మహా వెంకటేశ్వరరావు, సాధన కమిటి సభ్యులు సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, వీర్ల శ్రీనివాసరావు, కొన్నిపాటి చిదంబరరావు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా వలన కలిగే ఉపయోగాలను గూర్చి మహిళలకు వివరించారు. సీసీలు, ఎంఎస్ఎలు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. భట్టిప్రోలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గరికపాటి శ్రీరాములు యోగాసనాలు వేసి పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

ఆక్సిజన్ ప్లాంట్ పరిశీలన

రేపల్లె: హిందుస్థాన్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా బ్రాంచి ఆధ్వర్యంలో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్‌ను కోకాకోలా కంపెనీ సౌత్ ఇండియా సేల్స్ మేనేజర్ ఎం.పార్థసారథి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ రోగులకు అత్యంత అవసరమైన, ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను నిరంతరంగా 24 గంటలు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల నిర్వహిస్తుందన్నారు. సంవత్సరంన్నర కాలంగా నిరంతరంగా సేవలు అందిస్తుందన్నారు. ప్లాంట్ ఏర్పాటు కృషిచేసి నిర్విఘ్నంగా నిర్వహించబడటానికి కారకులైన సంస్థప్రతినిధి పార్థసారథికి పట్టణ పరిసర ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ కోశాధికారి ప్రభాకర్, కమిటీ సభ్యులు కరిముల్లా, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో మేలు

చెరుకుపల్లి: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు పూర్తి స్థాయిలో విజయవంతం చెయ్యాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లిఖార్జునరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు సమష్టిగా ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, లేదా అని అడిగి తెలుసుకుని సమస్య ఉంటే ఫిర్యాదుల పుస్తకంలో నమోదు చెయ్యాలన్నారు. ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పీఆర్ఏఈ ఫిరోజ్, ఈఓపీఆర్డీ మురళి పాల్గొన్నారు.

భట్టిప్రోలు తహసీల్దార్ బాధ్యతలు స్వీకారం



భట్టిప్రోలు: భట్టిప్రోలు తహసీల్దార్‌గా డి.వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రేపల్లె సీఎస్ డీటీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు వేమూరు తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్ కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ వెంకటేశ్వరరావును ఎంపీపీ వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు సన్మానించారు.

భట్టిప్రోలులో ప్రజావేదిక

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు మండలంలోని 15 గ్రామాలలో వివిధ బృందాలు సామాజిక తనిఖీ చేశారు. రూ. 6.50 కోట్ల వ్యయంతో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులను గూర్చి ఫీల్డ్ అసిస్టెంట్లను డ్వామా పీడీ వై.శంకర్ నాయక్ అడిగి వివరాలు సేకరించారు. పనులలో నిర్వహించిన చిన్న చిన్న పొరపాట్లను, మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ శోభన్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భవాని, అంబుడ్స్‌మెన్ బి.రత్తయ్య, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి పాల్గొన్నారు.

నీటితొట్టెలు ఏర్పాటు

రేపల్లెరూరల్: రహదారుల వెంబడి సంచరించే మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు రేపల్లె తహసీల్దార్ మల్లికార్జునరావు మానవత్వంతో స్పందించారు. తన సొంత ఖర్చులతో తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో శాశ్వత తాగునీటి తొట్టెలను నిర్మించి బుధవారం ప్రారంభించారు. వేసవిలో తాగునీరు లభించక మూగజీవాలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో నీటి తొట్టెలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నట్టల నివారణమందు పంపిణీ

పిట్టలవానిపాలెం: వైఎస్సార్ పశు బీమా పశుపోషకులకు ధీమా అని మంతెన వారిపాలెం పశువైద్యులు తిరుమల తేజ అన్నారు. మండలంలోని మంతెనవారిపాలెంలో గొర్రెలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు అపహరణ

బాపట్లటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రెండు విద్యుత్ మోటార్లు అపహరించారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కాలనీకు చెందిన చందవోలు వెంకటాచారి, మున్నంవారిపాలెంలోని పుట్టా అంకిరెడ్డి లకు చెందిన విద్యుత్ నీళ్ల మోటర్లు చోరీకు గురయ్యాయని బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ షేక్ రఫీ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

బాపట్లటౌన్: నిత్యం మద్యం మత్తులో తన భర్త తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని మేకల శారద బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పట్టణంలోని హయ్యర్‌నగర్‌కు చెందిన తనకు, నగరం మండలం ఈదుపల్లి గ్రామానికి చెందిన విప్పర్ల అశోక్ కుమార్‌తో 2014లో వివాహం జరిగిందన్నారు. రోజురోజుకు తన భర్త వేధింపులు భరించలేకపోతున్నానని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు పట్టణ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు విద్యుత్ అదాలత్

రేపల్లె: విద్యుత్ సమస్యలపై ఈ నెల 23వతేదిన తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు తెనాలి చెంచుపేటలోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రేపల్లె డీఈ పి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే అదాలత్‌లో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య



నగరం: ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈల కింద నిర్వహించిన రుణమేళా కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల ద్వారా 35శాతం సబ్సిడీపై రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. సేవారంగంలో రూ.25లక్షల వరకు, ఉత్పత్తి రంగంలో రూ.50లక్షల వరకు రుణాలు పొందవచ్చునన్నారు. డ్వాక్రా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఏపీఎం చంద్రశేఖర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం



'పది' ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన అఫీఫాజాన్‌ను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

చెరుకుపల్లి: చిన్నతనం నుంచి ఒక క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్ను కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వాకా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల్లో కల్పించిన వసతులను, విద్యా వ్యవస్థను చూసి ఉన్నత వర్గాల వారు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పదోతరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన ఎస్కె అఫీఫాజాన్(572)కు రూ.3వేలు నగదు, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ రెండవ స్థానం సాధించిన పుజిత్ సాయిరెడ్డి(562)కి రూ.2 వేలు నగదు, సిల్వర్ మెడల్ సర్టిఫికెట్, తృతీయ స్థానం సాధించిన సురయా అంజూమ్‌కు(555) రూ.వెయ్యి నగదు, బ్రౌన్ మెడల్ అందజేశారు. అదేవిధంగా మహిళా జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థినులకు కళాశాల ఉపాధ్యాయుడు మోర్ల వెంకటేశ్వరరావు వ్యక్తిగతంగా ఒక్కొకరికి రూ.వెయ్యి చొప్పున అంజేశారు. ఎంపీటీసీ దేవరపల్లి అమరేంద్ర, ఎంఈఓలు టి.నవీన్ కుమార్, పులి లాజర్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, కాటూరి కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆప్తమిత్ర' సేవలు ఎనలేనివి



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: సమాజానికి ఆప్తమిత్ర సేవాసమితి సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులకు ఆప్తమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో బుధవారం నిర్వహించిన ప్రోత్సాహక ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, బ్యాగ్‌లు, బోధనా సామగ్రి తదితర వస్తువులను ఉచితంగా అందిస్తుందన్నారు. కోవిడ్ సమయంలోనూ ప్రభుత్వ కార్యాలయాలలో సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు కోవిడ్ కిట్లను తమ వంతు బాధ్యతగా అందజేశారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ప్రథమస్థానం పొందిన అనిల్‌కు రూ.10వేలు, మండలస్థాయిలో 10వతరగతిలో ప్రథమస్థానంలో నిలిచిన జక్కా యశ్వంత్‌కు రూ.10వేలను అందజేశారు. అదేవిధంగా మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారధి, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుధాకర్, పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నాంచారయ్య, ఆప్తమిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గూడపాటి గోపాలకృష్ణ, కేవీకేవీ ప్రసాద్, రవికిశోర్, రాగం మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌పై గెస్ట్ లెక్చర్

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతిశాస్త్ర విభాగంలో భారత ఎన్నికల ఎన్నికల కమిషన్‌పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడికొండ బీఎస్ఎస్‌బీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు నాగమణి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఎన్నికల నిర్వహణ అనేది అత్యంత క్లిష్టతరమైందన్నారు. అలాంటి ఎన్నికలను నిస్పక్షపాతంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదన్నారు. అలాంటి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ మన ప్రజాస్వామ్యం విజయవంతంగా ముందుకు సాగడంలో తనవంతు పాత్రను ప్రపంచంలోనే ఎన్నికల సంఘం మన్ననలు అందుకుంటున్నారన్నారు. కళాశాల జాయింట్ సెక్రెటరీ మంతెన కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, అధ్యాపకులు ఉన్నారు.

చెరుకుపల్లి ఎంఈఓ-2గా టి.నవీన్‌కుమార్



చెరుకుపల్లి: ఎంఈఓ-2గా టి.నవీన్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నవీన్‌కుమార్ గతంలో రేపల్లె ఎంఈఓగా, చెరుకుపల్లి ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉపాధ్యాయులు నవీన్ కుమార్‌ను కలిసి సత్కరించారు. జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు, బి.సాంబయ్య నాయక్, కె.కిరణ్ లక్ష్మీనారయణ పాల్గొన్నారు.

భట్టిప్రోలు ఎంఈఓ-2 దేవరాజు..



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎంఈఓ-2 ఎస్.దేవరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పల్నాడు జిల్లా మాచర్ల మండలం తాళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడి వచ్చారు. భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు కలసి ఆయనను సన్మానించి, అభినందించారు. ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర కోశాధికారి గుర్రం మురళీమోహన్ ఆయనను కలసి అభినందనలు తెలిపారు. కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు, హెచ్‌ఎం రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టుద్వారా విచారించాలి



ఉప్పాలవారిపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు

చెరుకుపల్లి: పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌ను అతి కిరాతకంగా చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. అమర్నాథ్ స్వగ్రామం ఉప్పాలవారి పాలెంలో బుధవారం సీఐటీయూ - ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమర్నాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమర్నాథ్‌కు నివాళులర్పించారు. ఈసందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులు అమర్నాథ్ కేసును ప్రత్యేక కేసుగా పరిగణించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ వేగవంతం చేసి.. త్వరితగతిన శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమర్నాథ్ కుటుంబానికి భరోసా ఇవ్వటాన్ని హర్షిస్తూ అమర్నాథ్ అక్క చదువు పూర్తయ్యే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని, ఆమెకు కూడా ఉద్యోగ అవకాశం కల్పించి ఆ కుటుంబానికి పూర్తి భరోసాగా ప్రభుత్వం నిలవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్, చెరుకుపల్లి మండల సీఐటీయూ నాయకుడు కె.శరత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో మునిగి యువకుడు మృతి



యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న చింతర్లంక వాసులు

కొల్లూరు: పశువులను మేతకు తోలుకొని వెళ్లిన యువకుడు కృష్ణా నదిలోని లోతైన నీటి కుంటలో దిగిన గేదెలను తోలుకొచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, మృతుడి బంధువుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వక్కలగడ్డకు చెందిన మట్టా మురళీధరరావు 9 ఏళ్ల క్రితం తన భార్య పుట్టిన గ్రామమైన చింతర్లంకకు వచ్చి కుటుంబంతో ఇక్కడే స్థిరపడి జీవనం సాగిస్తున్నాడు. మురళీధరరావు కుమారుడు గోపాలకృష్ణ (20) పదోతరగతి వరకు చదువుకుని కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ తమకున్న పశువులను నిత్యం కృష్ణా నదిలోని పచ్చిక బైళ్లలోకి తోలుకెళ్లి మేపుకొని వస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం సైతం పశువులను తోలుకెళ్లగా సాయంత్రం పొద్దుపోయే సమయంలో పశువులు మాత్రమే ఇంటికి తిరిగి వచ్చాయి. పశువులను తోలుకురావాల్సిన గోపాలకృష్ణ ఎంతసేపటికి రాకపోవడంతో అనుమానించిన తల్లిదండ్రులు స్థానికుల సాయంతో కృష్ణానది పరిసరాలలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. రాత్రి సమయంలో గాలింపు సాధ్యం అవకపోవడంతో తిరిగి బుధవారం ఉదయం కృష్ణానదిలో అధిక లోతుతో ఉన్న నీటికుంటలో గజ ఈతగాళ్ల సాయంతో వెతుకులాడగా నీటిలో మునిగి ఉన్న గోపాలకృష్ణ మృతదేహం లభ్యమైంది. గోపాలకృష్ణ నదిలో మునిగి మృతి చెందడంతో స్థానికులు కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు సంసిద్ధులయ్యారు. అయితే మృతుడు నీటిలో మునకకు గురైన ప్రాంతం కృష్ణా జిల్లా పరిధిలోది కావడంతో పమిడిముక్కల ఎస్ఐ కేవీఎస్ సత్యనారాయణ సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే గోపాలకృష్ణ నదిలో మునిగి మరణించాడన్న సమాచారంతో చింతర్లంక వాసులు ప్రమాద ప్రాంతానికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలసి రోదిస్తుండటంతో ఆప్రాంతంలో విషాద చాయలు అలముకున్నాయి.

హెచ్‌ఎం లాజర్‌కు ఘన వీడ్కోలు

చెరుకుపల్లి: గుళ్లపల్లి జడ్పీహైస్కూల్‌ల్లో పులి లాజర్ హెచ్‌ఎంగా సుదీర్ఘ కాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి అందరి మన్ననలు పొందారని స్థానిక ఎంఈఓ నవీన్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వాకా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి బదిలీపై వెళ్లిన లాజర్, మరో ఆరుగురు ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ లాజర్, ఉపాధ్యాయుల సహకారంతో పది ఉత్తీర్ణతలో పాఠశాలను జిల్లాస్థాయిలో వరుసగా ఆరు సంత్సరాలు అగ్రస్థానంలో నిలిపారన్నారు. హెచ్‌ఎం లాజర్‌ను, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించా రు. మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, ఎంపీటీసీ దేవరపల్లి అమరేంద్ర, ఎంఈఓ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులు పొందాలి



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఏఓ బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: కౌలు రైతులు అందరు తప్పని సరిగా పంట సాగు హక్కు పత్రాలు తీసుకుని ప్రభుత్వం రైతులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని తుమ్మలపాలెం, బలుసులపాలెం గ్రామాల్లోని డాక్టర్‌వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల వద్ద కౌలు రైతుల గుర్తింపు కార్డులపై బుధవారం రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ కాలాలకు సంబంధించి పొలం కౌలుకు సాగు చేసే ప్రతి రైతు కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. దీని వల్ల కౌలు రైతు పంట నమోదు చేసుకోవచ్చని, పంట నమోదులో పేరు నమోదు అయితే మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్డు కేవలం 11నెలల కాలానికి మాత్రమే వర్తిస్తుందన్నారు. వీఆర్ఓ శ్రావణ్ కుమార్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

యాజలిలో...

యాజలి(కర్లపాలెం): రెవెన్యూ అధికారులు జారీ చేసే సాగు గుర్తింపు (సీసీఆర్సీ) కార్డుల కోసం కౌలు రైతులందరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. సీసీఆర్సీ కార్డులపై బుధవారం యాజలి, బుద్దాం రైతు భరోసా కేంద్రాల వద్ద కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాగుకు గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేసే వైఎస్సార్ రైతు భరోసా పథకంతో పాటు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కౌలు గుర్తింపు కార్డులు ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రైతులకు మాత్రమే వైఎస్సార్ రైతు భరోసా పథకం అమలవుతుందని చెప్పారు. యాజలి సర్పంచ్ భానుప్రసాద్, వీఆర్వోలు శివనాగరాజు, సుకన్య, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపీకృష్ణ, బాజీ, రైతులు పాల్గొన్నారు.

రుణాలతో మెరుగైన జీవనోపాధి

కర్లపాలెం: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులు మెరుగుపరుచుకోవాలని డీపీఓ డి.రాంబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కర్లపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజు బుధవారం జరిగిన మెగా రుణ మేళాకు విశేష స్పందన లభించింది. మండలంలోని ఎనిమిది సచివాలయాల నుంచి 150మంది హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీపీఓ మాట్లాడుతూ పేద వర్గాల వారి జీవనోపాధులు మెరుగుపడేందుకు ప్రభుత్వం విభిన్న శాఖల సమన్వయంతో రుణమేళా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు మంజూరు చేస్తుందని చెప్పారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పీఎం ఎఫ్ఎంఈ ద్వారా, పీఎం ఈజీపీ ద్వారా, మత్స్యశాఖ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈఓపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, హౌసింగ్ ఏఈ అన్వర్ బాషా, పలు బ్యాంకులకు సంబంధించిన ప్రతినిధులు, సీసీలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సురేష్



అమ ర్తలూరు(వేమూరు): అమర్తలూరు ఎస్ఐ గా పి.సురేష్ బాధ్యతలు చేపట్టారు. చీరాల టూ టౌన్ ఎస్ఐ గా ఉద్యోగం చేస్తు బదిలీపై అమర్తలూరు ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంత్రి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని పేకాట, దొంగతనాలుపై అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

భట్టిప్రోలులో కొనసాగిన క్రెడిట్ క్యాంప్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం నుంచి జరుగుతున్న క్రెడిట్ క్యాంప్‌నకు అనూహ్య స్పందన లభించింది. బుధవారం వెల్లటూరు, పెదపులివర్రు, ఓలేరు, గొరిగపూడి, పెదలంక, సచివాలయాల పరిధిలోని 436 మంది లబ్ధిదారులు హాజరైనట్లు మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ తెలిపారు. లబ్ధిదారులు పేర్లు నమోదు చేసుకున్న వెంటనే ఆయా శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో పాల్గొన్న ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి మాట్లాడుతూ రుణ మేళాలో పాల్గొన్న లబ్ధిదారులందరు బ్యాంక్, ఇతర శాఖల సహకారంతో ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని సుస్థిర జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, వెల్లటూరు సర్పంచ్ చౌటూరి లక్ష్మి, వెటర్నరీ డాక్టర్ బొర్రా లక్ష్మి రంజిత, హ్యాండ్లూమ్స్, వ్యవసాయ, హార్టికల్చర్, ఫిషరీస్ అధికారులతో పాటు మండలంలోని ఎస్‌బీఐ, యుబీఐ, సీజీజీబీ, జీడీసీసీ బ్యాంకుల మేనేజర్లు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు లాజర్ సంస్మరణ సభ

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంకు చెందిన సీపీఎం నాయకులు గొర్రుముచ్చు రాఘవులు(లాజర్)సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి. రమాదేవి మాట్లాడుతూ లాజర్ ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. తొలుత లాజర్ స్మారకంగా ఏర్పాటు చేసిన స్థూపాన్ని రమాదేవి ప్రారంభించారు. సీపీఎం బాపట్ల, గుంటూరు జిల్లాల కార్యదర్శులు సీహెచ్ గంగయ్య, పాశం రామారావు, బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఆయా జిల్లాల నాయకులు నళినీకాంత్, ఈమని అప్పారావు, చిష్టి, చిక్కాల మణిలాల్, బొనిగల అగస్టిన్, బాబురావు, ముజుందర్, నాగరాజు పాల్గొన్నారు.

హక్కు పత్రాలతో కౌలు రైతులకు రుణాలు

పిట్టలవానిపాలెం: పంట సాగుదారుల హక్కుపత్రాలు తీసుకోవడం వల్ల కౌలు రైతులు రుణాలు పొందవచ్చని ఏఓ సత్యానంద్ తెలిపారు. మండలంలోని సంగుపాలెం, చందోలు గ్రామాలలో సాగుదారులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ఈసాగు హక్కు పత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పొలం యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయిన గంగయ్య, గ్రామ కార్యదర్శి సుజాత ,వీఆర్ఓ భూసిమ్మ పాల్గొన్నారు.